క్లుప్తంగా

వైభవంగా అష్టోత్తర పూజలు



స్వామివారి అష్టోత్తర పూజలు చేస్తున్న భక్తులు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ఏడు శనివారాల నోము ఆచరించిన భక్తులు స్వామివారి అష్టోత్తర పూజలు చేశారు. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, పుణ్యాహవచనం తదితర పూజలను ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో అష్టోత్తర పూజలు నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో సభ్యులు, సిబ్బంది పర్యవేక్షించారు. గురువారం ఉదయం 9 గంటల నుంచి ఆలయ హుండీల లెక్కింపు ఉంటుందని ఈఓ సత్యనారాయణరాజు తెలిపారు.

దేహ దారుఢ్యానికి క్రీడలు అవసరం



అంబాజీపేటలో క్రీడా సామగ్రి పంపిణీ చేస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు

అంబాజీపేట: దేహ దారుఢ్యానికి క్రీడలు ఎంతో అవసరమని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. ప్రభుత్వం సరఫరా చేసిన క్రీడా సామగ్రిని అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో ఎంఈఓలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్ ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలకు బుధవారం అందజేశారు. ఎంపీపీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి విద్యార్థి ఏదో క్రీడలో సత్తా చాటేలా చూడాలన్నారు. హెచ్‌ఎం కడలి సాయిరాం, వీఎస్ఎన్ మూర్తి, ఉపాధ్యాయుడు వెన్నపు సత్యనారాయణ, సీఆర్పీ టి.నాగరాజు, టి.సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు బియ్యం వేలం

అంబాజీపేట: పలు కేసుల్లో స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యానికి గురువారం వేలం నిర్వహిస్తామని ఎంఎస్‌ఓ ఎం.రమాదేవి బుధవారం తెలిపారు. ఈ మేరకు జిల్లా పౌరసరఫరా అధికారి కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయన్నారు. అంబాజీపేట మండలంలో స్టాక్ పాయింట్ల వద్ద నిల్వ చేసిన 58.617 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యానికి ఉదయం 10 గంటలకు కలెక్టర్ కార్యాలయంలో వేలం నిర్వహిస్తారన్నారు. ఇందుకు సంబంధించి అంబాజీపేట తహసీల్దార్, స్టాక్ పాయింట్‌లకు, కొత్తపేట ఆర్డీవోలకు ఉత్తర్వులు అందజేస్తున్నామన్నారు.

23న కొబ్బరి చెట్ల ఫలసాయానికి...

అంబాజీపేట: స్థానిక మార్కెట్ యార్డులో కొబ్బరి చెట్ల ఫలసాయం, సహజంగా వచ్చిన పచ్చగడ్డిని తీసుకోవడానికి, యార్డు వద్ద ఉన్న షాపులు రెండేళ్ల కాలపరిమితికి ఈ నెల 23న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ వేటుకూరి వెంకట్రాజు, కార్యదర్శి వి.రామకృష్ణ తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.5 వేల డిపాజిట్ ఈ నెల 22వ తేదీ ఉదయం 11 గంటలలోపు చెల్లించి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు కార్యాలయ పనిదినాల్లో సంప్రదించాలన్నారు.

మండపాల భద్రత బాధ్యత కమిటీలదే

అంబాజీపేట: వినాయక నవరాత్ర ఉత్సవ మండపాల వద్ద భద్రతా ఏర్పాట్లు చేసుకునే బాధ్యత ఆ ఉత్సవాల నిర్వాహక కమిటీ ప్రతినిధులదేనని ఎస్‌ఐ ఎ.చైతన్యకుమార్ అన్నారు. రోజూ రాత్రి సమయాల్లో కమిటీకి చెందిన కనీసం ఇద్దరు ప్రతినిధులు మండపాల వద్ద ఉండాలని సూచించారు. బుధవారం మండలంలో ఏర్పాటు చేసిన చవితి మండపాలు, ఆలయాల కమిటీ నిర్వాహకులకు ప్రభుత్వ నిబంధనలను ఆయన వివరించారు. ఆయాచోట్ల బాణసంచా కాల్చరాదన్నారు. చివరిరోజు గణేశ విగ్రహాల నిమజ్జనోత్సవాలు, ఊరేగింపులను ఉత్సవ కమిటీల ప్రతినిధులు అప్రమత్తంగా నిర్వహించాలని సూచించారు. డీజేలకు అనుమతి లేదని, మద్యం తాగి నిమజ్జనంలో పాల్గొన రాదని ఎస్సై సూచించారు.

ఈ- పంట నమోదు వేగవంతం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ శివకుమార్

మలికిపురం: గ్రామాల్లో ఈ- పంట నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నల్లి శివకుమార్ తెలిపారు. గుడిమెళ్లంక రైతు భరోసా కేంద్రంలో బుధవారం గ్రామ అగ్రికల్చర్ అసిస్టెంట్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి రైతుకూ న్యాయం జరిగేలా సిబ్బంది పని చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు అందేలా చిత్తశుద్ధితో వ్యవహరించాలన్నారు. అసిస్టెంట్లు టి.సందీప్, సునీల్, నాగమణి, నాగదుర్గ పాల్గొన్నారు.

మార్కెట్ యార్డుకు మహర్దశ

- రూ 2.55 కోట్లతో అభివృద్ధి పనులు
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి



రావులపాలెం అరటి మార్కెట్ యార్డులో కెనాపి షెడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: అరటి మార్కెట్ యార్డుకు మహర్దశ పడుతోంది.. దీనికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. రైతులకు ఉపయోగపడేలా రావులపాలెం అరటి మార్కెట్ యార్డును అన్ని వసతులతో తీర్చిదిద్దుతున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి తెలిపారు. ఈ యార్డును రూ.2.55 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు ఆయన వివరించారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన కొత్తపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రెడ్డి రవిదేవి ఆధ్వర్యంలో బుధవారం ఈ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ యార్డులో రూ.70 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైన్లు, రూ.1.20 కోట్లతో కెనాపి షెడ్డు నిర్మాణం, అలాగే వ్యాపారస్తులకు అద్దెకు ఇచ్చేలా రూ.60 లక్షలతో 20 గదుల షాపింగ్ కాంప్లెక్స్ పనులకు శంకుస్థాపనలు చేశామన్నారు. మరో రూ.ఐదు లక్షలు కార్యాలయ మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయని జగ్గిరెడ్డి తెలిపారు. మార్కెట్ యార్డులో రైతుల కోరిక మేరకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిర్ల సోమసుందర రెడ్డి విగ్రహాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. యార్డులో పని చేస్తున్న 150 మంది కార్మికులకు బీమా సదుపాయం కల్పించేందుకు నూతన కమిటీ చర్యలు తీసుకుంటుందన్నారు. అనంతరం నూతన కమిటీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఏఎంసీ చైర్ పర్సన్ రెడ్డి రవిదేవి, జెడ్పీటీసీ సభ్యులు కుడుపూడి శ్రీనివాసరావు, గూడపాటి రమాదేవి, కొత్తపేట ఎంపీపీ మార్గన గంగాధరరావు, అవిడి సర్పంచ్ రెడ్డి చంటి, ఏఎంసీ డైరెక్టర్లు పమ్మి చంటి, సూర్రెడ్డి, చాంబర్ అధ్యక్షుడు కర్రి నాగిరెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి కె.విశాలక్షి, కార్యదర్శి వి.యశ్వంతరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరికీ స్వచ్ఛమైన జలాలు

ప్రజలందరికీ స్వచ్ఛమైన జలాలు అందించేందుకు జగనన్న ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి తెలిపారు. స్థానిక నక్షత్ర స్కూల్ ఎదురుగా రూ.55 కోట్లతో నిర్మించిన తాగునీటి ప్రాజెక్టును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ కొత్తపేట, రావులపాలెం మండలాల ప్రజలకు తాగునీటిని అందించే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును చేపట్టారన్నారు. దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో గోదావరి నీటిని శుద్ధి చేసి తాగునీరుగా ప్రజలకు అందించే ఉద్దేశంతో ఈ అపురూప ప్రాజెక్టుకు అడుగులు పడ్డాయన్నారు. నాడు బొబ్బర్లంక వద్ద ఒక ప్రాజెక్ట్ నిర్మించి ఆత్రేయపురం మండలానికి శుద్ధి నీటిని అందించారన్నారు. అనంతరం రావులపాలెం వద్ద మరో ప్రాజెక్ట్‌కు రూపకల్పన చేసి రావులపాలెం, కొత్తపేట మండలాలకు తాగునీరు అందించే పనులకు మొదలుపెట్టి నేడు ప్రారంభించామన్నారు. రూ.1,800 కోట్లతో మొత్తం కోనసీమ జిల్లాకు తాగునీరు అందించే ప్రాజెక్ట్ నిర్మాణానికి స్థలం సర్వే, డిజైన్ రూపకల్పన పనులు జరుగుతున్నాయన్నారు. అతి త్వరలోనే పనులు పట్టాలెక్కుతాయన్నారు. అనంతరం గోదావరి నీటి శుద్ధి ప్లాంట్‌ను ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పరిశీలించారు. జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, సర్పంచ్ తాడేపల్లి నాగమణి, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సాకా ప్రసన్నకుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా 'జగనన్నకు చెబుదాం'

- అర్జీల పరిష్కారానికి సత్వర చర్యలు
- అధికారులతో జేసీ నూపుర్‌అజయ్



కొత్తపేటలో జేసీకి సమస్యలు వివరిస్తున్న ఎంపీపీ గంగాధరరావు, జెడ్పీటీసీ రమాదేవి

కొత్తపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి వచ్చిన ప్రతి అర్జీకి సత్వర పరిష్కారం చూపాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నూపుర్ అజయ్ జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం నిర్వహించారు. ఆర్‌డీఓ ఎం.ముక్కంటి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జేసీ పాల్గొన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు హాజరయ్యారు. మండలంలో వివిధ గ్రామాల నుంచి ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులు అందించిన వినతులను జేసీ స్వీకరించారు. వాటిలో బిళ్లకుర్రు పంచాయతీ పరిధిలో సుమారు 25 ఎకరాల్లో కొబ్బరి చెట్లు చనిపోయి తీవ్రంగా నష్టపోయిన రైతులను ఓఎన్జీసీ ద్వారా ఆదుకోవాలని ఎంపీపీ మార్గన గంగాధరరావు, సర్పంచ్ నెల్లి లక్ష్మీపతిరావు ఆధ్వర్యంలో బాధిత రైతులు అర్జీ సమర్పించారు. కొత్తపేట పరిసర ప్రాంతాల మురుగు దిగే ఏకైక కై శిక డ్రైన్‌ను అభివృద్ధి చేయాలని జెడ్పీటీసీ సభ్యురాలు గూడపాటి రమాదేవి ఆధ్వర్యంలో స్థానికులు అర్జీ ఇచ్చారు. ఇలా రెవెన్యూకు సంబంధించి 13, మండల పరిషత్‌కు 8, విద్యుత్, హౌసింగ్ శాఖలకు 4 చొప్పున, డీఆర్‌డీఏకు 3, డ్రైన్స్, ఆర్‌డబ్ల్యూఎస్ సచివాలయాలకు రెండు చొప్పున, మరో 5 శాఖలకు 5తో మొత్తం 43 అర్జీలు వచ్చాయి. ప్రతి అర్జీదారుని నుంచి సంబంధిత సమస్యలను జేసీ సవివరంగా విన్నారు. వెంటనే సంబంధిత అధికారులను పిలిచి ఆ సమస్య దీర్ఘకాలికమైందా? అయితే ఇంతకాలం పరిష్కారం కాకపోవడానికి గల కారణాలపై ఆరా తీశారు. వాటి పరిష్కారానికి పలు సూచనలు చేశారు. తాజా సమస్య అయితే వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అందిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారులకు నాణ్యమైన పరిష్కార మార్గాలు సంతృప్తికర స్థాయిలో చూపాలని వివరించారు. ఈ కార్యక్రమంలో సీపీఓ వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్ ఎస్ఈలు ఎన్వీ కృష్ణారెడ్డి, కె.చంటిబాబు, డీఎల్‌డీఓ ఎం.ప్రభాకర్, తహసీల్దార్ జీడీ కిశోర్ బాబు, ఎంపీడీఓ ఇ.మహేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ వి.శివశంకరప్రసాద్, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, సివిల్ సప్లయిస్ డీఎం ఎస్.సుధాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో 'వైఎస్సార్ ఆసరా'



గోపాలపురంలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని సత్కరించి కృతజ్ఞతలు తెలియజేస్తున్న గంటి డ్వాక్రా మహిళలు

కొత్తపేట: సాంకేతిక కారణాలతో జమకాని వైఎస్సార్ ఆసరా సొమ్ము ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి కృషి ఫలితంగా తమ ఖాతాలకు జమ అయ్యిందని ఆయా సంఘాల మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. గంటి గ్రామానికి చెందిన ఇందిరా, ఆదర్శ, సంధ్య, నాగదేవి, సాయిరాం, యువతరం, హావేల డ్వాక్రా సంఘాలకు వైఎస్సార్ ఆసరా పథకం కింద రావాల్సిన రుణమాఫీ సొమ్ము రూ.24,13,602 సాంకేతిక సమస్యలతో జమ కాలేదు. ఈ విషయాన్ని సర్పంచ్ సాగి బంగార్రాజు, వైఎస్సార్ సీపీ నాయకుల ద్వారా ఎమ్మెల్యే జగ్గిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన వెంటనే స్పందించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా అనేక సంఘాలకు సాంకేతిక కారణాలతో నిలిచిపోయిన ఆసరా సొమ్మును జమ చేయించారు. బుధవారం గంటి గ్రామానికి చెందిన ఏడు డ్వాక్రా సంఘాల మహిళలు సర్పంచ్ సాగి బంగార్రాజు ఆధ్వర్యంలో గోపాలపురం వెళ్లి ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని కలసి సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీటీసీ సభ్యుడు ముళ్ల జనార్దనరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మట్టపర్తి వెంకట్రావు, గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు భూపతిరాజు సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర పోటీలకు వాడపాలెం స్కూల్ ప్రాజెక్టులు



వాడపాలెం హైస్కూల్‌లో రాష్ట్ర స్థాయికి ఎంపికైన ప్రాజెక్టు, టీమ్‌లతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

కొత్తపేట: రాష్ట్ర స్థాయి 'ఆంధ్రా టెక్ లీగ్' టెక్నికల్ ఈవెంట్ పోటీలకు వాడపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి రెండు ప్రాజెక్టులు ఎంపికైనట్లు హెచ్‌ఎం వై.చంద్రశేఖరం, అటల్ ల్యాబ్ ఇన్‌చార్జి నల్లం సత్యనారాయణరావు తెలిపారు. ఈ వివరాలను వారు విలేకరులకు తెలిపారు. ఇటీవల సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఆంధ్రా టెక్ లీగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జోనల్ స్థాయి టెక్నికల్ ఈవెంట్‌లలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా అటల్ టింకరింగ్ ల్యాబ్స్ కలిగిన ఉన్నత పాఠశాలల నుంచి విద్యార్థులు తమ ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఇందులో వాడపాలెం ఉన్నత పాఠశాల నుంచి 4 బృందాలు పాల్గొన్నాయన్నారు. వాటిలో కళాసృజన్ ప్రాజెక్టుతో బి.జ్యోత్స్న, పి.నిషిత, ఎం.హేమ బృందం, చిట్టిప్రో (రోబో) ప్రాజెక్టుతో ఎస్.సౌమ్య, కె.కృప బృందం రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాయని తెలిపారు. వీరు అక్టోబర్ 1న విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీలో జరిగే రాష్ట్ర పోటీల్లో తమ ప్రాజెక్టులు ప్రదర్శిస్తారు. ఆ బృందాలను వైస్ ఎంపీపీ బండారు సత్యమంగతాయారు, బండారు కృష్ణమూర్తి, ఎంపీటీసీ సభ్యుడు నేలపూడి భీమరాజు, సర్పంచ్ త్సామా బాబు, ఏఏబీ చైర్మన్ పెదపూడి శ్రీనివాస్, యువజన సంఘం నాయకుడు పెదపూడి బాపిరాజు, గ్రామ పెద్దలు చీకట్ల రామారావు, మట్టా బాబ్జి, పీఎంసీ చైర్మన్ సింగిరెడ్డి ఏసు అభినందించారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' సర్వే పరిశీలన



పెదపట్నంలంకలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకటేశ్వరరావు

మామిడికుదురు: పెదపట్నంలంకలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' సర్వేను ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు బుధవారం పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న తీరును పరిశీలించి గడువులోగా సర్వేను పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు ప్రతి ఇంటిని సందర్శించి మ్యాపింగ్ చేయాలన్నారు. ఆ ఇంట్లో ఎవరు ఏవిధమైన ఆరోగ్య సమస్యతో బాధపడుతున్నారో గుర్తించి వారికి తదుపరి నిర్వహించే ప్రత్యేక శిబిరాల ద్వారా అవసరమైన పరీక్షలు చేయడంతో పాటు మందులు, కళ్లజోళ్లు అందిస్తారన్న సమాచారాన్ని స్పష్టంగా తెలియజేయాలని ఎంపీడీఓ తెలిపారు. ఏఎన్‌ఎం పి.నాగమణి, ఎంఎల్‌హెచ్‌పీ పి.నాగదుర్గ, ఆశ కార్యకర్తలు ఎం.విజయలక్ష్మి, ఎం.గీతాభవాని, వలంటీర్లు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

అంబాజీపేట: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ మద్దింశెట్టి దొరబాబు, ఎంపీటీసీ సభ్యుడు వాకపల్లి దొరబాబు అన్నారు. వాలకగరువులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సీహెచ్‌ఓ బి.అప్పారావు, హెల్త్ అసిస్టెంట్ జేవీఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగుల వివరాలను యాప్‌లో నమోదు చేసి టోకెన్‌లను అందజేశారు. ఎంఎల్‌హెచ్‌పీ సంధ్య, ఏఏఎన్‌ఎం గౌరీశ్వరి, వైఎస్సార్ సీపీ నాయకులు గోగి శ్రీరామమూర్తి, కేతా రాజు, వాకపల్లి శ్రీనివాసరావు, చప్పిడి రాజు, కాంద్రేగుల నాగబాబు, వాకపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మండల కమిటీ అధ్యక్షుల నియామకం



కొమ్ముల రాము



నక్కా వెంకటేశ్వరరావు



వాసంశెట్టి చినబాబు



కుడుపూడి విద్యాసాగర్

మామిడికుదురు: పి.గన్నవరం నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలకు వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఆదేశాలు జారీ చేసిందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు తెలిపారు. మామిడికుదురు మండల శాఖ అధ్యక్షునిగా కొమ్ముల రాము, పి.గన్నవరం మండల శాఖ అధ్యక్షునిగా నక్కా వెంకటేశ్వరరావు, అంబాజీపేట మండల శాఖ అధ్యక్షునిగా వాసంశెట్టి చినబాబు, అయినవిల్లి మండల శాఖ అధ్యక్షునిగా కుడుపూడి విద్యాసాగర్‌ను నియమించారు. అయినవిల్లి మినహా మిగిలిన మూడు మండల శాఖలకు పాత అధ్యక్షులనే కొనసాగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. అయినవిల్లి మండల శాఖ అధ్యక్షుడు మట్టపర్తి శ్రీనివాస్ అనారోగ్యం బారిన పడటంతో అతని స్థానంలో కుడుపూడి విద్యాసాగర్‌ను నియమించారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా



మామిడికుదురులో వాలీబాల్ పోటీలో తలపడుతున్న విద్యార్థులు



జిల్లా జట్టుకు ఎంపికైన అంతర్వేదికర పాఠశాల విద్యార్థులతో ఉపాధ్యాయులు

మామిడికుదురు: రాజోలు నియోజకవర్గ స్థాయి క్రీడలు మామిడికుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో బుధవారం ప్రారంభమయ్యాయి. అండర్-14, 17 బాలుర, బాలికల విభాగాల్లో జరుగుతున్న ఈ క్రీడల్లో భాగంగా వాలీబాల్, త్రోబాల్ పోటీలు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలోని 23 స్కూళ్లకు చెందిన 200 మంది విద్యార్థులు ఉల్లాసంగా, ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎంఈఓ మోకా వెంకన్నబాబు, పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ నిరంజని పర్యవేక్షణలో జరుగుతున్న ఈ పోటీలు మండల స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ మట్టా శ్రీధర్ పర్యవేక్షణలో జరుగుతున్నాయి.

ఈదరాడ విద్యార్థుల ప్రతిభ

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన మండల స్థాయి స్కూల్ ఫెడరేషన్ గేమ్స్, గ్రిగ్స్ పోటీల్లో ఈదరాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పలు విభాగాల్లో ప్రతిభ చూపారు. అండర్-14, 17 కేటగిరీల్లో షటిల్, టెన్నికాయిట్, ఖోఖో, జావెలిన్ త్రో, డిస్కస్ త్రో, షార్ట్‌పుట్ పోటీల్లో విజేతలుగా నిలిచారు. విద్యార్థులను స్కూల్‌లో జరిగిన సమావేశంలో హెచ్‌ఎం జి.సాయిబాబు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

పి.గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నియోజకవర్గ స్థాయి బాలికల అండర్-14, 17 స్కూల్ గేమ్స్ నిర్వహించారు. మొత్తం 8 విభాగాల్లో పోటీలు జరిగాయి. ఇందులో విజేతలను ఉమ్మడి జిల్లా పోటీలకు ఎంపిక చేసినట్టు ఎంఈఓలు కోన హెలీనా, చింతా వీరభద్రం తెలిపారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.రమేష్, నియోజకవర్గ క్రీడా పోటీల సమన్వయకర్త కేవీ రమణ, హెచ్‌ఎంలు డీఎస్‌వీ ప్రసాద్, చిరంజీవి, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ గూటం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సఖినేటిపల్లి: అంతర్వేదికర జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి పలు క్రీడాంశాల్లో జిల్లా జట్లకు ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం పి.సోమ సూర్యకుమారి అభినందించారు. ఇటీవల మండల స్కూల్ గేమ్స్‌ను ఎంఈవో-1 డి.కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. బాలుర వాలీబాల్ పోటీల్లో విజేతలైన కె.అలెగ్జాండర్, కె.రాకేష్, పూర్ణచంద్, బాలికల త్రోబాల్ పోటీల్లో విజేతలైన సీహెచ్ సత్యవేణి, బి.తరుణశ్రీలను జిల్లా జట్టుకు ఎంపికైనట్టు పీడీ భాస్కరరావు తెలిపారు. టీచర్ మన్నే సత్యనారాయణ పాల్గొన్నారు.

శాంతిని కాంక్షిస్తూ...



శాంతి చిహ్నంగా ఏర్పడిన విద్యార్థులు

మామిడికుదురు: అంతర్జాతీయ శాంతి దినోత్సవాన్ని పురస్కరించుకుని మామిడికుదురులోని ఓ ప్రైవేట్ స్కూల్ విద్యార్థులు శాంతికి నిదర్శనమైన తెలుపు రంగు దుస్తులు ధరించి శాంతి చిహ్నంగా ఏర్పడి ఆకట్టుకున్నారు. దీంతో పాటు శాంతికి ప్రతీకగా నిలిచే పావురం ఆకారంలో ఒదిగిపోయారు. కార్యక్రమంలో డీవీవీ సత్యనారాయణ, యక్కలదేవర నాగన్నబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



కొత్తపేట భవిత కేంద్రంలో పరిశీలిస్తున్న డీఈఓ కమలకుమారి

కొత్తపేట: ఉపాధ్యాయులు పదో తరగతి విద్యార్థులను దత్తత తీసుకుని మెరుగైన ఉత్తీర్ణత సాధించేలా చూడాలని డీఈఓ కె.కమలకుమారి సూచించారు. బుధవారం కొత్తపేటలో పలు పాఠశాలలు, భవిత సెంటర్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు గల బాలల అభ్యసనా సామర్థ్యాలు పరిశీలించారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల నోట్ బుక్స్ చూశారు. 9వ తరగతి విద్యార్థుల ట్యాబ్‌లను పరిశీలించారు. రోజూ ట్యాబ్‌లతో పాఠశాలలకు హాజరు కావాలని, వాటిని సక్రమంగా వినియోగించాలని సూచించారు. అనంతరం గౌతమీనగర్ పాఠశాలను తనిఖీ చేశారు. ఎంఆర్‌సీలో ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. పాఠశాలల స్థితిగతుల గురించి సమీక్షించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలకు అనుగుణంగా ఫలితాలు సాధనపై దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలన్నారు. అందుకు ప్రత్యేక కృషి చేయాలన్నారు. లైబ్రరీ వినియోగం పెంచాలని, రిజిస్టర్‌లను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్, హెచ్‌ఎం అల్లూరి గోపాలరాజు పాల్గొన్నారు.

గణనాథా భజేహం



అంబాజీపేటలో వినాయకునికి కుంకుమతో అలంకరణ

అంబాజీపేట: గణపతి నవరాత్ర ఉత్సవాల సందర్భంగా అంబాజీపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద శ్రీలక్ష్మి గణపతి ఆలయంలో స్వామివారు బుధవారం కుంకుమ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు మర్ల వెంకట శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో స్వామివారిని కుంకుమతో అలంకరించారు. అంబాజీపేట మండలం గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం, మొసలపల్లి, ఇరుసుమండ, ముక్కామల, పసుపల్లి, వక్కలంక, కముజువారిలంక, పుల్లేటికుర్రు, కె.పెదపూడి తదితర గ్రామాల్లో నెలకొల్పిన చవితి మండపాలలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోతాయిలంకలో గణపతి ఆలయం వద్ద భారీ అన్న సమారాధన జరిగింది. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి ఆలయం వద్ద విద్యుత్ దీపాలంకరణ

అయినవిల్లి: వినాయక నవరాత్ర ఉత్సవాలను పురస్కరించుకుని స్థానిక విఘ్నేశ్వరుని ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకరణ ఆకట్టుకుంటోంది. బుధ, గురువారాల్లో ఆలయం భక్తులతో కిక్కిరిసింది. స్వామికి ఆలయ వేద పండితులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా అయినవిల్లి, విలస, సిరిపల్లి, నేదునూరు తదితర గ్రామాల్లో వినాయక మండపాల వద్ద ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతున్నాయి.

ఈవోపీఆర్డీగా పదోన్నతి



సుబ్బారావు

ఆలమూరు: మండలంలోని మోదుకూరు, గుమ్మిలేరు పంచాయతీల కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న డి.సుబ్బారావుకు ఈవోపీఆర్డీగా పదోన్నతి లభించింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో రెండు రోజుల్లో సుబ్బారావుకు పోస్టింగ్ ఇవ్వనున్నారు.

ఆత్మహత్యలు సమస్యలకు పరిష్కారం కాదు



సదస్సులో మాట్లాడుతున్న విద్యార్థిని

మలికిపురం: ఆత్మహత్యలు సమస్యలకు పరిష్కారం కావని రిసోర్స్‌పర్సన్ నక్కా రమేష్‌బాబు అన్నారు. బుధవారం స్థానిక ఎంవీఎన్ జేఎస్ అండ్ ఆర్వీఆర్ ప్రభుత్వ ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు స్పందన-ఈదా ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి రిసోర్స్‌పర్సన్‌గా సంస్థ జిల్లా అధ్యక్షుడు ఎస్.రమేష్‌బాబు, డాక్టర్ ఇ.శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల్లో మనోధైర్యాన్ని నింపే పలు అంశాలను తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ టి.సతీష్ అధ్యక్షత వహించారు. అధ్యాపకులు కేవీహెచ్ విజయ్ కుమార్, రోహేల్‌బాబు, ప్రసాద్ పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు

రాజోలు: మండలంలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంపీడీఓ ఎన్.బాలాజీ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కాట్రేనిపాడు (బీసీ-ఏ), పాలగుమ్మి (ఎస్సీ-మహిళ), పాదలాడ (బీసీ-బీ), శివకోటి (ఎస్సీ), తాటిపాక (బీసీ-ఏ) పోస్టులకు ఈ నెల 23వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసి సదరు పత్రాలను సంబంధిత పంచాయతీ కార్యదర్శులకు అందజేయాలన్నారు.

ఎలుకల నిర్మూలన చేపట్టాలి

రాజోలు: రైతులు సామూహికంగా ఎలుకల నిర్మూలన చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి వై.మధుకుమార్ సూచించారు. ఈ మేరకు బుధవారం గ్రామ వ్యవసాయ సహాయకులతో సమీక్షించారు. ఎలుకలు నిర్మూలించేందుకు 22వ తేదీ నుంచి మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద బ్రోమోడయోలిన్ కలిపిన ఎర మందును రైతులకు పంపిణీ చేస్తారన్నారు.

టీడీపీ రిలే దీక్షలు

పి.గన్నవరం: స్కిల్ స్కామ్ కేసులో చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ పి.గన్నవరంలో టీడీపీ నాయకులు బుధవారం రిలే దీక్షలు చేపట్టారు. నాయకులు డొక్కా నాథ్‌బాబు, తోలేటి సత్తిబాబు, మొల్లేటి శ్రీను, పెచ్చెట్టి వెర్రియ్య పాల్గొన్నారు.